క్లుప్తంగా

మృతుని కుటుంబానికి సాయం



త్రినాథరావు కుటుంబానికి సాయం అందిస్తున్న పట్టా రామ అప్పారావు మిత్ర బృందం

అగనంపూడి: గత నెలలో మృతి చెందిన దాన బోయినపాలెంకు చెందిన డ్రైవర్ గళ్ల త్రినాథరావు కుటుంబానికి సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, తన మిత్ర బృందం కలిసి రూ.16500 నగదు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుదే సుశీలా గజేంద్రరావు, కిడిమి హనుమంతురావు, మస్తాన్‌రెడ్డి, పిళ్లా శ్రీను, లక్కరాజు రాము తదితరులు పాల్గొన్నారు.

నీటి లీకేజీలు అరికట్టాలి



రాజీవ్‌నగర్ కూడలి వద్ద పైప్‌లైన్ లీకేజీతో రహదారిపై వృథాగా పోతున్న మంచినీరు

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ కూడలిలో పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. గత కొన్నాళ్లుగా ఇక్కడ పైప్‌లైన్ పగలడం.. సిబ్బంది సరిచేయడం.. మళ్లీ లీకేజీ కావడంతో నీటి వృథాతోపాటు కలుషితం అవుతోందని రాజీవ్‌నగర్ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఇదే ప్రాంతంలో ఇబ్బంది తలెత్తుతోందని, పూర్తిస్థాయిలో సరిచేసి నీటి లీకేజీలు లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఘనంగా దాసరి పైడితల్లమ్మ పండగ



దాసరి పైడితల్లమ్మ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ, దాసరిమెట్ట ప్రాంతాల్లో కొలువైన దాసరి పైడితల్లమ్మ పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు కొలువైన ప్రాంతాలకు భక్తులు వేకువజామునే చేరుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 4 నుంచి అమ్మవారి పండగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయని, నిత్యం అమ్మవారికి విశేష పూజలు చేపట్టి మంగళవారం ఆఖరి రోజున ప్రధాన పండగ జరుపుకున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అర్హులందరికీ మత్స్యకార భరోసా అందించాలి



మత్స్యశాఖ జేడీ విజయకృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మహారాణిపేట: అర్హత ఉన్న వారందరికీ మత్స్యకార భరోసా ఇవ్వాలని విశాఖ కోస్టల్ మర బోటు సంఘం అధ్యక్షుడు బర్రి కొండబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ విజయకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. మత్స్యకార భరోసా నుంచి 2061 మంది పేర్లు తొలగించారని ప్రచారం జరుగుతోందని, దీని వల్ల మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జేడీని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు చీకటి రమేష్, వాసుపల్లి దాసు, సురపతి దాసు, ఎం.రాజా తదితరులు ఉన్నారు.

ఓపీకి ‘అభయ’ం

ABHA
Your Health Your Choice

అభయ యాప్

- ప్రభుత్వ ఆస్పత్రిలో అభయ యాప్ ద్వారా సేవలు
- ఓపీ రిజిస్ట్రేషన్ కూడా యాప్‌లోనే..



అగనంపూడి ఆస్పత్రిలో ఓపీ కౌంటర్ వద్ద అభయ యాప్ డౌన్‌లోడ్ కోసం వేచి ఉన్న రోగులు, వారి సహాయకులు

అగనంపూడి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఓపీ రిజిస్ట్రేషన్ కూడా యాప్ ద్వారా చేయాలని నిర్ణయించారు. కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రతీ రోగి, వారి సహాయకులకు ఆండ్రాయిడ్ ఫోన్ కలిగి ఉంటే చాలు. ఓపీ కోసం బారులు తీరిన జనాల మధ్య క్యూ ఉండాల్సిన అవసరం లేదు. ఎంచక్కా అభయ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపీ నమోదు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ముందుగా ప్లేస్టోర్‌లో అభయా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఫోన్ నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తరువాత ఓటీపీ ఫోన్‌కు వచ్చాక నమోదు చేయాలి. అనంతరం రోగి వివరాలు యాప్‌లో నమోదు చేశాక యాప్‌ను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. తరువాత ఓటీపీ జనరేట్ అవుతుంది. ఇక్కడితో ఓపీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రిలో అభయ యాప్ ద్వారానే రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించినట్టు అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి తెలిపారు. ఆస్పత్రిలో సంప్రదిస్తే తమ సిబ్బంది యాప్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు.



అగనంపూడి ఆస్పత్రి

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పరంధామయ్య, విళ్లా రామ్మోహన్ కుమార్ కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1216వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి పట్టుకొమ్మ వంటి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అలాగే వర్కింగ్ క్యాపిటల్ అందించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలన్నారు. గత ఏడాదిన్నరగా యాజమాన్యం, ప్రభుత్వ చర్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి నుంచి ఉపశమనం పొందడానికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులు, నాయకులు శ్రీనివాసరాజు, సాయి నాగబాబు, వేణుగోపాలరావు, జోషి, మధుసూదనరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలువ



భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద సర్వీసు రోడ్డు పక్కన కోతకు గురైన కాలువ

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ) సిగ్నల్ పాయింట్ వద్ద రాంనగర్ వైపు సర్వీసు రోడ్డు పక్కనున్న కాలువ ప్రమాదకరంగా మారింది. కాలువ భారీగా కోతకు గురికావడంతో రోడ్డు కుంగుపోతోంది. రానున్నది వర్షాకాలం కావడంతో కాలువ కోత తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు ఎటువంటి రక్షణ వ్యవస్థ కూడా లేకపోవడంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కాలువ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

షరతులతోనే మద్దతు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విదసం రాష్ట్ర కన్వీనర్ వెంకటరావు

ఉక్కునగరం: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా మాత్రమే ఎన్డీయేకు టీడీపీ మద్దతు కొనసాగించాలని విదసం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం విదసం రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ, స్టీల్‌ప్లాంట్ రక్షణ, ప్రత్యేక హోదా సాధనే ప్రధాన షరతులుగా ఉండాలన్నారు. ఎన్డీయేకు టీడీపీ మద్దతు లౌకికవాదానికి ముప్పు అయినప్పటికీ బీజేపీ నుంచి ప్రమాదం జరగకుండా ఉండేలా చంద్రబాబు మద్దతు కొనసాగించాలన్నారు. ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు, ఎస్.ఆర్.వేమన, వివిధ జిల్లాల కన్వీనర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన జీవనం



పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో పాల్గొన్న డీఈవో చంద్రకళ తదితరులు

జగదాంబ: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో టీటీసీ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడానికి అంతా కలిసి మొక్కలు పెంచి భూతాపాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్వశిక్ష అడిషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల వాడడంతో ప్రకృతి విపత్తులు పెరుగుతాయని, ఉష్ణోగ్రతలు ఎక్కువ అవుతాయని తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రనాథ్‌తో కలిసి అతిథులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థతో సత్వర న్యాయం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ



సదస్సులో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

పెందుర్తి: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మండలంలోని గొరపల్లిలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు న్యాయ సహాయం అవసరం అయితే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని వ్యాజ్యాలు లేని గ్రామాలుగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.ఎస్ రంగలక్ష్మి, ఆర్‌ఐ సాయికిరణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజు, సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

గొల్లలపాలెంలో తల్లిదండ్రుల మృతితో అనాథలుగా చిన్నారులు



చిన్నారుల తల్లిదండ్రులు నూకరాజు, కనకమ్మ(ఫైల్)



అనాథలుగా మారిన చిన్నారులు

సబ్బవరం: మండంలోని గొల్లలపాలెం గ్రామంలో చిన్న వయస్సులోనే తల్లిదండ్రులు ఒకరి తర్వాత మరొకరు మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఆ చిన్నారులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లలపాలెం ఎస్సీ కాలనీలో చందా నూకరాజు(35) కనకమ్మ(30) వారి కుమారులు పవన్ కుమార్, అర్జున్‌లతో కలిసి నివాసం ఉంటున్నారు. నూకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతి చెందిన నాటి నుంచి కనకమ్మ తీవ్ర మనోవేదనకు గురై పిల్లల భవిష్యత్, పోషణపై దిగులుతో అనారోగ్యం పాలైంది. దీంతో ఆమె ఈ నెల 1వ తేదీన మృతి చెందింది. దీంతో గ్రామస్తులు తలా ఓ చెయ్యివేసి ఆమె దహన సంస్కారాలు పూర్తి చేశారు. తల్లిదండ్రుల మృతితో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు.

పెద్దకుమారుడు పవన్‌కుమార్ సబ్బవరం గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా.. చిన్న కుమారుడు అర్జున్ నంగినారపాడు జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ఆలనా పాలనా చూసే పెద్దదిక్కు లేకపోడంతో వారిని దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని చిన్నారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా, తదితరులు

పెదగంట్యాడ: పొగాకుకు దూరంగా ఉండాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా సూచించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వద్ద మానవహారంగా ఏర్పడి పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20 రోజులపాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యా సంస్థల్లోని విద్యార్థులకు కూడా అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎఫ్ రవీంద్ర, పీహెచ్ఎన్ అన్నపూర్ణ, హెచ్ఎస్ బి.గోపాలం, ఏఎన్ఎంలు రెడ్డి రమణమ్మ, బొడ్డు విజయభాను, ఎం.దేవి, స్టాఫ్ నర్స్ కాశీదేవి, వెంకటలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా కిట్లు సరఫరా చేయాలి



భవిత కేంద్రంలోని చిన్నారులతో రాష్ట్ర సహిత విద్య కో ఆర్డినేటర్ కల్పన

పెదగంట్యాడ: విద్యార్థులకు నాణ్యమైన కిట్స్ అందజేయాలని రాష్ట్ర సహిత విద్య కో ఆర్డినేటర్, రాష్ట్ర స్టూడెంట్ కిట్ అబ్జర్వర్ ఎస్.కల్పన ఆదేశించారు. మండల విద్యాశాఖ కార్యాలయంతోపాటు స్టూడెంట్స్ కిట్లను భద్రపరిచిన నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాగులు, పుస్తకాలు ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులకు కిట్లు సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహిత సమన్వయకర్త బి.గీత, ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

పెదగంట్యాడ: సమగ్ర శిక్ష ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సహిత విద్య కో ఆర్డినేటర్, రాష్ట్ర స్టూడెంట్ కిట్ అబ్జర్వర్ ఎస్.కల్పన కోరారు. మండలంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. దివ్యాంగ పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహిత సమన్వయకర్త బి.గీత, ఎంఈవోలు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.



స్టూడెంట్స్ కిట్స్ పరిశీలిస్తున్న కల్పన

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలకు వినతి



డీఈవో చంద్రకళకు వినతి పత్రం అందిస్తున్న అప్సా నాయకులు

గాజువాక: ప్లే స్కూల్స్ పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం(అప్సా) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస భాస్కరరావు ఆధ్వర్యంలో నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నగర పరిధిలోని పలు పాఠశాలల్లో ఎటువంటి అనుమతులు లేకుండా పూర్వ ప్రాథమిక తరగతులతో పాటు ప్రాథమిక తరగతులను కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో కూడా నమోదు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అప్సా నాయకులు బి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నేడు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీత, తదితరులు

సీతంపేట : అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.సునీత చేతుల మీదుగా మంగళవారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో కలిసి ఈ నెల మొత్తం చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న ముఖ్య విభాగాల అధికారులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్రవంతి డైరెక్టర్ ఎం.మాలిని, విశాఖ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ప్రతినిధి హరి, ఆదర్శ ఇంటి పనివారల సంఘం ప్రతినిధులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్లు ఎ.రాజు, ఆర్.రమాదేవి, ఎస్.మోహనలక్ష్మి, ఏసీఎల్‌లు మనోజ్, నరేష్, పద్మావతి పాల్గొన్నారు.

గర్భిణుల పేర్ల నమోదుతో మెరుగైన సేవలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వరరావు



తాళ్లవలస పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు



ఆనందపురం పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహిస్తున్న జగదీశ్వరరావు

తగరపువలస: గర్భిణుల పేర్లు మూడు నెలల్లోగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. ఆనందపురం పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల పేర్లు త్వరగా నమోదు చేయడం వల్ల వారికి అవసరమైన సేవలు అందించడానికి వీలవుతుందన్నారు. వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించిన కేంద్రాల్లో స్కానింగ్ చేయించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తల్లీబిడ్డ వాహన సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆశ కార్యకర్తలు ‘ఆశ’ యాప్‌ను రోజూ ఉపయోగించుకోవాలని ఆదేశించారు. కిల్కారి మొబైల్ యాప్ సేవలను గర్భిణులకు ఉపయోగపడేలా, అక్కడి నుంచి వచ్చే ఫోన్ కాల్స్ వినేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డయేరియా ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, ఎన్‌హెచ్‌ఎం పరిపాలన అధికారి రమేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు గంగునాయుడు, షెహనాజ్ సాధియా, జిల్లా కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్ష

భీమిలి మండలం తాళ్లవలస, ఆనందపురం పీహెచ్‌సీలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. అర్హులందరూ వ్యాక్సిన్ వేసుకునేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు, జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. రికార్డులతో పాటు ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జున రావు, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్తు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తాటిచెట్లపాలెం వాటర్ ట్యాంక్ సమీపంలోని ప్రశాంతినగర్‌లో కలకత్తాకు చెందిన నంది కన్ని (37) నివాసం ఉంటున్నాడు. అతను కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. 2017లో జీవనోపాధి కోసం విశాఖ వచ్చి అన్నావదినలతో ఉంటున్నాడు. గత నెలలో తల్లి చనిపోవడంతో పాటు తనకు పెళ్లి కాలేదని మనస్తాపంతో మంగళవారం ఉదయం మేడపై ఉన్న మెట్లకు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై కుటుంబ సభ్యులు ఫోర్తుటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

పరవాడ: క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఐ ఆర్ ఎస్ ఎం వాలీబాల్, త్రోబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. పవర్ పరిశ్రమల నుంచి విచ్చేసిన ఉద్యోగులు, యువతకు పోటీలు నిర్వహించారు. రామగుండం, తెలంగాణ, కుడ్గీ, సదరన్ రీజియన్ హెచ్‌క్యూ, సింహాద్రి స్టేషన్లకు చెందిన టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా ట్రోఫీలను ఆవిష్కరించారు.